https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 / సంచిక:24 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / బుధవారం, సెప్టెంబర్ 09,2026

# పోలీస్ రాజ్యం..

## నిరంకుశ పాలనలో నిర్బంధకాండ

పోలీస్ రాజ్యం.. నిరంకుశ పాలనలో నిర్బంధకాండ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి దౌర్జన్యకాండకు దిగింది. మంగళవారం హైదరాబాద్‌లో అడుగడుగునా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజామునే బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఇండ్లకు వెళ్లి తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకులు క్రిశాంక్ ఇంటికి వెళ్లి రౌడీయిజాన్ని ప్రదర్శించారు.

**తెల్లవారుజాము నుంచే బీఆర్ఎస్ నేతల ఇండ్లలోకి చొరబడిన పోలీసులు**



**ఎమ్మెల్సీల అక్రమ అరెస్టులు..దురుసు ప్రవర్తనలు..భగ్గుమన్న గులాబీ శ్రేణులు**

**సిటీబ్యూరో, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9 :**

కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి దౌర్జన్యకాండకు దిగింది. మంగళవారం హైదరాబాద్‌లో అడుగడుగునా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజామునే బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఇండ్లకు వెళ్లి తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకులు క్రిశాంక్ ఇంటికి వెళ్లి రౌడీయిజాన్ని ప్రదర్శించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యకాండకు దిగారు. పోలీసుల నోటీకి అడ్డూ అదుపులేకుండాపోయింది. బీఆర్ఎస్ నేతలపై పరుష పదజాలాన్ని ఉపమోగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కేసీఆర్‌పై చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తారోకో, ధర్నాలు, ఆందోళనలు చేయడంతో హైదరాబాద్ అట్టుడికింది.రాజకీయ వార్తలు చదవండి

**డైవర్షన్ పాలిటిక్స్‌కు పోలీసుల అండ !**

కాంగ్రెస్‌కు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ ఎండగుడుతుందనే భయం పట్టుకుం ది. ఇలాంటి సమయంలోనే నామ మాత్రంగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి.. మామ అన్పించేందుకు ప్రయత్నిస్తోందనే ఆరోపణలున్నాయి. ఇలాంటి సమయంలో అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ తమను ప్రజా సమస్యలపై నిలదీస్తుందనే భయాం దోళనకు గురైన కాంగ్రెస్ నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని జకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. సోమవారం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి రాకుండా అడ్డుతగులు తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు కొనసాగింపుగా మంగళవారం కూడా హైదరాబాద్‌లో పోలీసులను ముందు పెట్టి బీఆర్ఎస్ శ్రేణులపై దౌర్జన్యకాండ సాగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలను మంగళవారం ఉద యం అరెస్ట్ చేశారు. ఆ ఇద్దరి అరెస్ట్‌తో ఒక్కసారిగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ఎమ్మెల్సీల అరెస్ట్ విషయాన్ని తెలుసుకొని భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు నారాయణగూడ ఠాణాకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లపై పోలీసులు దాడులు చేసి ఎక్కడికక్కడ నిర్బంధించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ నివాసానికి కార్ఖానా సీఐ అనురాధ వెళ్లారు. క్రిశాంక్ ఇంట్లో లేరని, చిన్న పాప ఉందని ఆయన కుటుంబ సభ్యులు చెప్పినా వినకుండా ఇంట్లో పనిచేసే సిబ్బందిపై పరుషపదజాలంతో విరుచుకు పడ్డారు. ఆపై క్రిశాంక్‌పై దౌర్జన్యానికి దిగారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

**బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు**

ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, పలువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా వెళ్తున్నారనే సమాచారంతో అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అక్కడకు బయలుదేరారు. దీంతో సికింద్రాబాద్ ప్రాంతంలోనే పోలీసులు వారిని అడ్డుకొని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఏకంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారు. ప్రజాప్రతినిధుల వాహనాలను అడ్డుకొని తీవ్ర పదజాలంతో పోలీసులు దౌర్జన్యకాండ సాగించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు కేటీఆర్ ఇతర నాయకులను, జవహర్‌నగర్‌కు హరీశ్‌రావును తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు వేలాదిగా అక్కడకు చేరుకున్నారు రోడ్డుపై బైఠాయించారు. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలో కాంగ్రెస్ పార్టీ షదా ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు బారీ సంఖ్యలో ఆయా నాయకులు ఉన్న పోలీస్‌స్టేషన్ల వద్దకు చేరుకున్నారు. ఇంతలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గ్రేటర్ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లలో సదరు కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఆయనతో ఆ మాటలు అన్పించిన ముఖ్యమంత్రిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర వ్యాప్తంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.



# 5 ఇరానీ ట్యాంకర్లను పేల్చిన అమెరికా..

## జోర్డాన్‌లో యూఎస్ బేస్‌పై అటాక్

టెహ్రాన్: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9

ఇరానీ ట్యాంకర్లపై అమెరికా దళాలు అటాక్ చేశాయి. సుమారు అయిదు ట్యాంకర్లను పేల్చినట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల నుంచి అమెరికా యుద్ధనౌకను ఇరాన్ టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో అగ్రరాజ్యం ప్రతీకార దాడులకు దిగినట్లు సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. గల్ఫ్ ఆఫ్ ఓమన్‌లో ఉన్న ఐఆర్జీసీకి చెందిన నాలుగు ఇరానీ ఆయిల్ ట్యాంకర్లను టార్గెట్ చేసింది అమెరికా. ఖర్గ్ దీవి దగ్గర మరో ట్యాంకర్‌ను కూడా పేల్చేశారు. అమెరికా తాజా దాడులకు కౌంటర్‌గా ఇరాన్ కూడా ప్రతిదాడులు చేసింది.జోర్డాన్‌లో ఉన్న అమెరికా బేస్‌ను టార్గెట్ చేసింది. అయితే ఇరాన్ ప్రయోగించిన 20 క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో ఎదుర్కొన్నట్లు జోర్డాన్ చెప్పింది. మొత్తం 18 క్షిపణులను కూల్చినట్లు పేర్కొన్నది. గత వారం నుంచి ఇరాన్, అమెరికా మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్న విషయం తెలిసిందే.మరో వైపు ఆసియాలో ట్రేడింగ్‌లో ఇంధన ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌పై 1.5 శాతం పెరిగింది. ఇక అమెరికా ఇంధనం 1.6 శాతం అధికంగా ట్రేడింగ్ అయ్యింది. జోర్డాన్‌పై ఇరాన్ ఫైర్ చేసిన క్షిపణుల్లో రెండు మాత్రం జనాభా లేని ప్రాంతాల్లో పడినట్లు తెలుస్తోంది.

# పోలీసు ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులు స్వీకరించండి: తెలంగాణ హైకోర్టు

**ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశం**

**దరఖాస్తుల్లో 'ఇతరులు' అనే కాలమ్ లేకపోవడంపై ఆగ్రహం**

**భౌతికంగానైనా అప్లికేషన్లు తీసుకోవాలని రిక్రూట్‌మెంట్ బోర్డుకు సూచన**

**ట్రాన్స్‌జెండర్ల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ధర్మాసనం అసంతృప్తి**

**హోంశాఖ, డీజీపీకి వివరణ కోరుతూ ఉన్నత న్యాయస్థానం నోటీసులు**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9

తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించకపోవడంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తు ఫారంలో స్త్రీ, పురుష లింగాలతో పాటు 'ఇతరులు' అనే కాలమ్‌ను ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని, రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రశ్నించింది. ట్రాన్స్‌జెండర్ల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు జారీచేసిన నోటిఫికేషన్లలో తమకు అవకాశం కల్పించలేదని సూర్యాపేట జిల్లాకు చెందిన డి.తనుశ్రీ, మరికొందరు ట్రాన్స్‌జెండర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదిస్తూ, అన్ని రంగాల్లో ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పించాలని గతంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. వాదనలు విన్న ధర్మాసనం, సమాజంలో కేవలం రెండు లింగాలే ఉంటాయన్న మూస ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. గతంలో హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రభుత్వం ఇప్పటికీ



మార్గదర్శకాలు ఎందుకు రూపొందించలేదని నిలదీసింది. దరఖాస్తుల గడువు ఈనెల 16 వరకు ఉందని బోర్డు తరఫు న్యాయవాది తెలపడంతో, ఆన్‌లైన్ పోర్టల్‌లో అవకాశం లేకపోతే భౌతికంగానైనా సరే ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు తీసుకుని, వారికి రశీదు ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హోంశాఖ, డీజీపీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## ఏపీ పర్యాటకానికి కొత్త జోష్.. 10 ప్రాంతాల్లో సీ ప్లేన్ల సందడి!

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9

**స్కైహోప్ ఏవియేషన్, మె హెయిర్ సంస్థలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**ఒక్కో వాటర్‌డ్రోమ్ నిర్మాణానికి రూ. 20 కోట్ల వ్యయం అంచనా**

**ఉడాన్ పథకం కింద ఆపరేటర్లకు కేంద్రం ఆర్థిక చేయూత**

**మొదటి దశలో విజయవాడ, విశాఖ, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో సేవలు**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. రాష్ట్రంలోని కీలక పర్యాటక ప్రాంతాలను జల మార్గాల ద్వారా అనుసంధానించే సీ ప్లేన్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు స్కైహోప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలి ఎయిర్ సర్వీసెస్ (మె హెయిర్) సంస్థలు ముందుకు రాగా, కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వాటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.



## వీర్లపల్లి శంకర్ అలా అనలే.. చావు డప్పు కొడుతామన్నారు..

# వెనుకేసుకొచ్చిన స్పీకర్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9:

కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ సీఎం కేసీఆర్ చావును కోరుకుంటున్నామని అనలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. కేవలం చావు డప్పు కొడుతామని మాత్రమే అన్నారని వెనుకేసుకొచ్చారు. ఒకవైపు, కేసీఆర్ చావాలని కోరుకుంటున్నట్టుగా వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతుండగా, స్పీకర్ మాత్రం ఆయనను వెనుకేసుకొనిరావడం గమనార్హం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో తొలిసారిగా మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ పలు అంశాలను మీడియాతో పంచుకున్నారు. తాను అనుకుంటే ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సభ్యత్వాలను రద్దు చేయగలనని, కానీ అలా చేయడం పద్ధతి కాదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తనను తిట్టిన వీడియోను చూశానని తెలిపారు. అయితే వాళ్లు క్షమాపణ చెబుతారని అనుకున్నానని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డిపై పోలీసులు దాడి చేయడంపై ఎలా స్పందిస్తారని మీడియా ప్రశ్నించగా.. దీనిపై ఇప్పటికే విచారణకు ఆదేశించామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి గురించి ప్రశ్నించగా.. ఎమ్మెల్యేలే పోలీసులను కొట్టినట్టుగా కనిపించిందన్నారు.

## సేవింగ్స్ కాదు.. అప్పులే ఎక్కువ.. మధ్యతరగతి కుటుంబాలపై

# ఆర్‌బీఐ షాకింగ్ నివేదిక

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9

నాలుగేండ్ల క్రితం భారతీయ కుటుంబాలు తమ వద్ద ఉన్న ప్రతి 100 రూపాయల ఆర్థిక పొదుపునకు 27 రూపాయల అప్పును కలిగి ఉండేవి. నేడు ఆ అప్పు 32 రూపాయలకు చేరింది. వారు పొదుపు చేయడం మానలేదు. కాని వారి అప్పులు మాత్రం పొదుపు కంటే వేగంగా పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తన 2026 ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన తాజా గృహ ఆర్థిక స్థితిగతులు నివేదిక ఈ చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నది. ఈ ఏడాది మార్చి నాటికి భారతీయ కుటుంబాల వద్ద రూ.490.3 లక్షల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులు(జీడీపీలో 41.6 శాతం) ఉన్నాయి. అదే సమయంలో వారిపై రూ.158.5 లక్షల కోట్ల(జీడీపీలో 45.8 శాతం) రుణభారం ఉంది. ఇవి కేవలం ఆర్థిక పొదుపులు మాత్రమే. ఆస్తి, బంగారం ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. చాలా కుటుంబాల విషయంలో వీటి విలువ ఇంకా ఎక్కువ ఉంటుంది.




### అప్పుదే పైచేయి

2022 జూన్ నుంచి 2026 మార్చి వరకు ఉన్న 16 త్రైమాసికాల కాలంలో కుటుంబాల రుణాలు 78 శాతం పెరిగాయి. పొదుపు 49 శాతం పెరిగింది. ఆర్థిక వ్యవస్థ 41 శాతం వృద్ధి చెందింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే రుణాల వృద్ధి రేటు దాదాపు రెట్టింపుగా ఉంది. కుటుంబాలు తమ వద్ద ఉన్న ఆస్తుల మొత్తాన్ని తగ్గించుకోలేదు. పైగా ఆ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం ఆరంభంతో పోలిస్తే ముగింపు సమయానికి వారి వద్ద ఉన్న ఆస్తుల విలువ పెరిగిందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. అయితే వాటికి తోడుగా తీసుకున్న అప్పుల విషయంలో మాత్రం మార్పు వచ్చింది. ఈ 49 శాతం ఆ మొత్తం నాలుగు సంవత్సరాల కాలానికి వర్తిస్తుంది. 2024 మార్చి నాటి గణాంకాలను పరిశీలిస్తే ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే పొదుపు వృద్ధి నెమ్మదిగా ఉందని ఆర్‌బీఐ డేటా వెల్లడిస్తున్నది. కేవలం అప్పులు మాత్రమే వేగంగా పెరుగుతూ వచ్చాయి.

### పొదుపులో మార్పు

కుటుంబాలు తమ డబ్బును దాచుకునే విషయంలో మార్పు వచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి కుటుంబాల ఆర్థిక ఆస్తులలో 34.4 శాతంతో బ్యాంక్ డిపాజిట్లు ఇప్పటికీ అతిపెద్ద వాటాను కలిగి ఉన్నాయి. అయితే 2022 జూన్‌లో ఉన్న 36 శాతం వాటాతో పోలిస్తే ఇది తగ్గింది. మ్యూచువల్ ఫండ్స్ అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి. వీటి వాటా 6.4 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. ప్రత్యక్ష షేర్ల పెట్టుబడులు 20.1 శాతం నుంచి 18.1 శాతానికి తగ్గాయి. కుటుంబ పొదుపులో ప్రతి 100 రూపాయల్లో సుమారు 29 రూపాయలు షేర్లు, మ్యూచువల్ ఫండ్ల రూపంలో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం మార్కెట్ కదలికలకు అనుగుణంగా మారుతుంటుంది. నాలుగేండ్ల క్రితంలో పోలిస్తే ప్రస్తుతం కుటుంబాల ఆస్తులలో షేర్ల ధరలతోపాటు పెరిగే లేదా తగ్గే భాగం ఎక్కువగా ఉంది.

# భారత్‌లో పుంజుకున్న నియామకాలు.. మెట్రో నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానం




**భారత్‌లో 14 శాతం పెరిగిన వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు**

**నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదికలో వెల్లడి**

**ఆటోమొబైల్, హెల్త్‌కేర్ రంగాల్లో నియామకాల జోరు**

**అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భువనేశ్వర్ టాప్**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9

భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు ఊపందుకున్నాయి. గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 14 శాతం వృద్ధి నమోదైంది. ఈ విషయంలో దేశంలోని మెట్రో నగరాల్లో హైదరాబాద్ 23 శాతం వృద్ధితో అగ్రస్థానంలో నిలిచింది. ఈ వివరాలను ప్రముఖ జాబ్ పోర్టల్ 'నౌకరీ డాట్ కామ్' తన 'జాబ్‌స్పీక్ ఇండెక్స్' నివేదికలో వెల్లడించింది. నౌకరీ డాట్ కామ్ నివేదిక ప్రకారం, గత ఏడాది ఆగస్టులో 2,664 పాయింట్లుగా ఉన్న జాబ్‌స్పీక్ సూచీ, ఈ ఏడాది ఆగస్టు నాటికి 3,028 పాయింట్లకు చేరింది. ముఖ్యంగా ఆటోమొబైల్, ఆరోగ్య సంరక్షణ, రిటైల్ రంగాలు ఈ వృద్ధికి కీలక పాత్ర పోషించాయి. ఆటోమొబైల్ రంగంలో నియామకాలు 19 శాతం పెరగ్గా, ఆరోగ్య సంరక్షణ రంగంలో 16 శాతం, రిటైల్ రంగంలో 15 శాతం వృద్ధి కనిపించింది. మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్ తర్వాత కోల్‌కతా 22 శాతం వృద్ధితో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఇక అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భువనేశ్వర్ 32 శాతం వృద్ధితో అగ్రస్థానంలో నిలిచింది. రాయ్‌పూర్ (23 శాతం), సూరత్ (21 శాతం), రాంచీ (19 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఐటీ, ఐటీయేతర రంగాల్లో ఈ సానుకూల ధోరణి కనిపించిందని నౌకరీ డాట్ కామ్ తెలిపింది. అంతేకాకుండా, ఫ్రెషర్ల నుంచి సీనియర్ స్థాయి ఉద్యోగుల వరకు అన్ని అనుభవాల కేటగిరీల్లోనూ నియామకాలు పెరగడం గమనార్హం.

## నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన..

# బిజీబిజీగా షెడ్యూల్

**పి.గన్నవరం నియోజకవర్గంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ**

**రైతులతో సమావేశమై, గ్రామసభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**సాయంత్రం నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో ప్రత్యేకంగా భేటీ**

**రాత్రికి తిరిగి అమరావతికి పయనం కానున్న చంద్రబాబు**

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 9



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో పర్యటించి, రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసు కోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 09:45 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:30 గంటలకు అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10:55 గంటలకు మాచవరం గ్రామానికి వెళ్లి రైతులతో సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను స్వయంగా అందజేస్తారు. అనంతరం మధ్యాహ్నం 01:55 గంటలకు పందువారిపేటలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పర్యటనలో భాగంగా సాయంత్రం 03:15 గంటలకు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ కార్యక్రమాలన్నీ ముగించుకుని సాయంత్రం 05:40 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.